# ఉరి వేసుకున్న వ్యక్తికి ఊపిరి

**★ఆపద్బాంధవులుగా 108 సిబ్బంది ★అంబులెన్స్‌లోనే ఎమర్జెన్సీసేవలు ★హృదయ స్పందన, నాడి వేగం పడిపోకుండా అట్రోపిన్ ఇంజక్షన్‌న ★స్పృహకోల్పోయిన బాధితునికి పునర్జన్మ ★అభినందిస్తున్న గ్రామస్తులు**

*చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఒక ప్రాణానికి 108 సిబ్బంది దేవదూతల్లా మారి పునర్జన్మ నిచ్చారు! కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఉరివేసుకొని, స్పృహకోల్పోయి విగతజీవిగా మారిన వ్యక్తికి అంబులెన్స్‌లోనే అత్యవసర చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన సంఘటన శామీర్‌పేట మండలంలో చోటుచేసుకుంది. సమయస్ఫూర్తితో స్పందించి మృత్యువు నోటి నుంచి ప్రాణాన్ని లాక్కొచ్చిన కీసర 108 సిబ్బంది చాకచక్యాన్ని స్థానికులు, కుటుంబ సభ్యులు ఆపర సంజీవనిగా జేజేలు పలికారు.*




అంబులెన్స్‌లో అత్యవసర చికిత్స అందిస్తున్న పైలట్ అఖిల్

**శామీర్‌పేట, ఆగస్టు 9, ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ వ్యక్తికి 108 సిబ్బంది సమయానుకూలంగా స్పందించి పునర్జన్మనిచ్చిన సంఘటన శామీర్‌పేట మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన బొంత కృష్ణ (50) ఆదివారం ఉదయం కుటుంబంలో తలెత్తిన కలహాల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఉదయం 10 గంటల సమయంలో ఊరి బయటకు వెళ్లి ఓ చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ఉరితాడును తొలగించి, కుటుంబ సభ్యులతో పాటు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆ సమయంలో శామీర్‌పేట అంబులెన్స్ మరొక అత్యవసర సేవలో ఉండటంతో, వెంటనే కీసర 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే కీసర 108 పైలట్ అఖిల్, అత్యవసర వైద్య నిపుణుడు చిత్రం రవి అత్యంత వేగంగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్ర శ్వాసకోశ సమస్యతో, నోటిలో ద్రవాలు అడ్డుపడి స్పృహకోల్పోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న కృష్ణను వెంటనే అంబులెన్స్‌లోకి తీసుకున్నారు. అంబులెన్స్ లోనే ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ ఫిజిషియన్ సూచనల మేరకు నాడి వేగం, హృదయ స్పందన పడిపోకుండా అట్రోపిన్ ఇంజెక్షన్ అందించారు. వ్యాక్యూమ్ పరికరంతో శ్వాసమార్గానికి అడ్డుగా ఉన్న ద్రవాలను సక్షన్ చేసి తొలగిస్తూ, ఆక్సిజన్ మరియు గ్లూకోజ్ ద్రవాలను ఎక్కించి అత్యవసర చికిత్స అందించారు. సిబ్బంది సమయస్ఫూర్తితో సకాలంలో వైద్యం అందించి, ఆసుపత్రికి తరలించే వరకు ప్రాణాలను కాపాడారు. సమయానికి చేరుకుని తమ కుటుంబ పెద్ద ప్రాణాలు నిలిపిన కీసర 108 సిబ్బంది చిత్రం రవి, పైలట్ అఖిల్‌లకు బొంత కృష్ణ కుటుంబ సభ్యులు చేతులెత్తి నమస్కరిస్తూ కన్నీటిపర్యంతమై ధన్యవాదాలు తెలిపారు. 108 సిబ్బంది అందించిన రక్షణ సేవలను గ్రామానికి చెందిన పలువురు కొనియాడారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త





భాగ్యనగరంతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా బోనాల పండుగ ఘనంగా సాగింది. పసిడి వర్ణపు కలశాలతో, వేప ఆకుల పచ్చదనంతో ఊరంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. లయబద్ధమైన డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల నడుమ భక్తులు పోటెత్తారు. పట్టు వస్త్రాలు ధరించి పసిపాపల నుంచి వయోవృద్ధుల వరకు అమ్మవారికి నైవేద్యాలు (బోనాలు) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాజకీయ ప్రముఖులు, సినీ తారలు సైతం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

3లో



# భక్తిపారవశ్యం

## ఆషాఢ బోనాల కోలాహలం

- ◆ఊరూరా అమ్మవారికి పట్టు వస్త్రాలు.. బోనాల సమర్పణ
- ◆ఆకట్టుకున్న పోతరాజుల కొరడా దెబ్బల విన్యాసాలు
- ◆శివసత్తుల పూనకాలతో మారుమోగిన వీధులు
- ◆ఆలయాల్లో వెల్లివిరిసిన భక్తజన సంద్రం.. ◆ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిన శోభాయాత్రలు

## బస్ ఎక్కుతుండగా ఫోన్ చోరీ

### బ్యాంక్ ఖాతాలో రూ.1.55 లక్షలు స్వాహా

### మూడు రోజుల్లో విడతల వారీగా నగదు బదిలీ

**కొత్తూర్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** బస్సు ఎక్కుతున్న సమయంలో మొబైల్ ఫోన్ చోరీకి గురికాగా, అదే ఫోన్ ద్వారా బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి ఏకంగా రూ.1.55 లక్షలు మాయమైన ఘటన కొత్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. సంఘటన వివరాలు:పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జున కాలనీకి చెందిన లింగాల జగన్ గౌడ్ జులై 21న ఉదయం 9 గంటల సమయంలో విధుల నిమిత్తం కొత్తూర్ బస్‌స్టాండ్‌కు వచ్చారు. ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆయన జేబులో ఉన్న మొబైల్ ఫోన్‌ను చాకచక్యంగా అపహరించాడు. అనంతరం జులై 23 నుంచి 26వ తేదీ మధ్య బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి విడతల వారీగా వివిధ ఖాతాలకు ఆన్‌లైన్ ద్వారా నగదు బదిలీ అయినట్లు బాధితుడు గుర్తించారు. మొత్తం రూ.1,55,000 తన ఖాతా నుంచి మాయమైనట్లు తెలుసుకున్న జగన్ గౌడ్ వెంటనే కొత్తూర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు:ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ క్రైమ్ సాంకేతిక ఆధారాల సహాయంతో ఆన్‌లైన్ లావాదేవీలు, ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశారు.

## బోరు మోటారు వేస్తూ విద్యుత్ షాక్‌తో రైతు మృతి..

**దుద్యాల్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** దుద్యాల్ మండలం లగచర్ల గ్రామానికి చెందిన తుంకిమెట్ల రమేష్ గౌడ్ (33) శనివారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రమేష్ పొలంలో బోరు మోటారు ప్రారంభించే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య లావణ్య, మూడేళ్ల కుమార్తె సాత్విక, ఐదు నెలల చిన్నారి ఉన్నారు. తండ్రి రెండేళ్ల క్రితమే మృతి చెందగా, కుటుంబానికి రమేష్ పెద్దదిక్కుగా ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీశైలం తెలిపారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## బోనాల పండుగ వేళ అపశృతి..మందుల బస్తీలో అగ్నిప్రమాదం

**మెహిదీపట్నం, ఆగస్టు 9, ప్రభాతవార్త :** బోనాల పండుగ వేళ లంగర్‌హౌస్ మందుల బస్తీలో అపశృతి చోటు చేసుకుంది. ఓ ఇంట్లో మంటలు చెలరేగి ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమయింది. లంగర్ హౌస్ ఇన్ స్పెక్టర్ కథనం ప్రకారం.. లంగర్ హౌస్ మందుల బస్తిలో దశరథ్‌గౌడ్ భవనంలోని రెండవ అంతస్తులో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆదివారం బోనాల పండుగను పురస్కరించుకొని ఇంట్లోని అమ్మవారికి పూజలు నిర్వహిం చిన అనంతరం బోనంతో స్థానికంగా ఉన్న దుర్గామాత దేవాలయానికి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో మంటలు వ్యాపించి ఉన్నాయి. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో రూ.15 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని యజమాని దశరథ్ గౌడ్ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వాహనం

## 38 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

### -ముగ్గురు అరెస్ట్..ముగ్గురు పరారీ

**ఘట్‌కేసర్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** అక్రమంగా తరలిస్తున్న 38 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని ఘట్‌కేసర్ పోలీసులు స్వాధీనం చేసుకొని ముగ్గురుని అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం ఘట్‌కేసర్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో అంబేద్కర్ విగ్రహం సమీపంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు 38 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈఘటనకు సంబంధించి నాగరాజు, చంద్రశేఖర్, తరుణ్ అనే ముగ్గురిని అరెస్ట్ చేశారు.
ఈఅక్రమ రవాణా వ్యవహారంలో పాల్గొన్న మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు గుర్తించగా, వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ కేసులో ఒక అశోక్‌లేలాండ్ దోస్త్ ఆటో, 38 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ దుకాణంలో తీసుకున్న ప్రజాపంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అక్రమంగా సేకరించడం, రవాణా చేయడం, విక్రయించడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని సిఐ బాలస్వామి తెలిపారు.

## పునాసపై పెరిగిన విశ్వాసం

**•వర్షాలతో రైతన్న ఉల్లాసం**
**•కంది, పత్తి పంటలకు జీవం!**
**•దిగుబడులపై ధీమాలో వికారాబాద్ రైతులు!**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వానలు లేవని పునాస పంటలపై ఆశలు వదులుకున్న రైతన్నకు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు పంటలకు జీవం పోశాయి. ఆరంభంలో విత్తుకున్న పంటలపై క్రమంగా రైతుల్లో విశ్వాసం పెరుగుతోంది. జూలై చివరి వారం నుంచి కురుస్తున్న వర్షాలు పంటలకు మేలు చేకూర్చాయి. జిల్లాలో 80 శాతం పంటలు వర్షాధారితంగా పండిస్తారు. సరైన వర్షాలు కురిస్తేనే ప్రధాన పంటలు పత్తి, కంది చేతికి వస్తాయి. రైతులు ప్రతీయేటా వరుణుడిపైనే గంపెడాశలు పెట్టుకుంటారు. ఈసారి జూన్‌లో ఒకటి రెండు వానలు పడగానే విత్తనాలు వేసుకున్నారు. కానీ ఏకంగా 50 రోజుల పాటు వాన జాడ లేక అయోమయానికి గురైనారు. జూలై మూడో వారం వరకు రైతులు దిగాలు చెందారు. కొంతమంది విత్తనాలు కూడా వేయలేదు. వేసుకున్న పంట చేతికి రాదని ఆశలు వదులుకున్న తరుణంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. భారీ వర్షాలు కురిశాయి. లోటు వర్షపాతం నుంచి పలు మండలాల్లో సాధారణ, అధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

జిల్లాలో స్థూల సాగు విస్తీర్ణం 4.85 లక్షల ఎకరాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వర్షాభావం కారణంగా 3.63 లక్షల ఎకరాలకే పరిమితం చేసి 1.22 లక్షల ఎకరాలల్లో విత్తనాలు వేసుకోలేదు. ఇటీవల కురిసిన వర్షాలు పత్తి, కంది పంటకు ఎంతగానో మేలు చేసిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నల్లరేగడి భూముల్లో వర్షపు నీరు ఇంకిపోయి పత్తి, కంది పంటల దిగుబడులకు దోహదపడుతుంది. ప్రస్తుత వర్షాల వల్ల పత్తి పంట ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు సాధ్యం కావచ్చని రైతులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఐదు మాసాల లోపు పత్తి పంట చేతికి వస్తుంది. ఎకరా పత్తి సాగు చేసేందుకు రూ.20 వేల వరకు పెట్టుబడులు చేస్తారు. ఈసారి కూడా పంటకు డోకా లేదని బషీరాబాద్ మండలం నవాల్గా గ్రామ రైతు పెద్ద కుర్వ అంజిలయ్య విశ్వాసం వ్యక్తం చేశారు. పత్తి తర్వాతి మంచి లాభసాటి పంటలో కంది కూడా ఉంది. ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు సాధించవచ్చని రైతు బోయిని ఈశ్వరయ్య తెలిపారు. కంది పంట ఎకరాకు రూ.10 వేల వరకు పెట్టుబడులు పెడుతుంటారు. ఆరు నెలలకు కంది పంట చేతికి వస్తుంది. బషీరాబాద్, యాలాల, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల, పెద్దేముల్ మండలాల్లో పత్తి, కంది పంటలు భేషుగ్గా ఉన్నాయి. జిల్లాలో పత్తి పంట సాధారణ సాగు విస్తీర్ణత 2.46 లక్షల ఎకరాలు ఉండగా ఈసారి 2.22 లక్షల ఎకరాలకే పరిమితమైంది. కంది సాగు సాధారణ విస్తీర్ణత 1.30 లక్షల ఎకరాలు ఉండగా 95 వేల ఎకరాలే వేసుకున్నారు. రానున్న రెండు మాసాల్లో అడపా దడపా వర్షాలు కురిస్తే కంది, పత్తి పంటలు భేషుగ్గా ఉంటాయని రైతులు అంటున్నారు. మొక్కజొన్న, పెసర, మినుము పంటలు కూడా ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు.





బషీరాబాద్ మండలంలో కళకళలాడుతున్న పంటలు




కొమురం భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజన నేతలు

## ప్రకృతి సంరక్షణలో ఆదివాసీల పాత్ర కీలకం

**కడ్తాల్, ఆగస్టు 9, ప్రభతవార్త :** ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కడ్తాల్ మండల కేంద్రంలో బిర్సా ముండా, కోమరం భీం చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి త్యాగాలను స్మరించుకొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల రాఘవేందర్ మాట్లాడుతూ, ఆదివాసీలు మన దేశ మూలవాసులు. అడవులు, ప్రకృతి పరిరక్షణలో వారి పాత్ర గొప్పది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, రమేష్, కిరణ్, శ్రీశైలం, మహేష్, శివ, చింటు, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రేపు రైతు సహకార పొదుపు సంఘం సమావేశం

**ఘట్‌కేసర్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఈనెల 11వ తేదీన రైతు పరస్పర సహకార పొదుపు సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు గౌరీశంకర్ తెలిపారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ శివాలయం ఆవరణలో మంగళవారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో రైతులు, ప్రజలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యులుగా చేరాలని ఆయన కోరారు. 2016 ఏప్రిల్‌లో సహకారశాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి సంఘం స్థాపించామని గత పది సంవత్సరాలుగా రైతులు, ప్రజలు, చిరువ్యాపారులు చేరి పొదుపు చేస్తూ ఆర్థిక అవసరాలు తీర్చుకుంటున్నారని ఆయన తెలిపారు. ఎదులాబాద్ డివిజన్ పరిధిలోని ఎదులాబాద్, కొత్తగూడెం, ఘణాపూర్, మర్రిపల్లిగూడెం, మాదారం, అంకుశాపూర్, అవుషాపూర్‌లకు చెందిన రైతులు, ప్రజలు సంఘంలలో సభ్యత్వం తీసుకోవాలని ఆయన సూచించారు. సంఘం సభ్యుల పొదుపు ఆధారంగా ఆర్థిక సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తుందని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షులు గౌరీశంకర్ విజ్ఞప్తి చేశారు.



ఎంపి రాజేందర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ధర్మకర్త పవనాచార్యులు

## రంగనాయకస్వామి జాతరకు ఎంపికి ఆహ్వానం

**ఘట్‌కేసర్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లోని శ్రీగోదా సమేత మన్నారు రంగనాయకస్వామి జాతర మహోత్సవానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ దంపతులను ఆహ్వానించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త టిపి.పవనాచార్యులు స్థానిక బిజెపి నాయకులతో కలిసి ఎంపీ ఈటల నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి జాతర ఆహ్వానపత్రికను అందజేశారు. ఈనెల 13 నుంచి 19 వరకు ఆలయంలో జాతర జరుగుతుందని 16న కళ్యాణోత్సవం, 17న దివ్యవిమాన రథోత్సవం జరుగుతుందని విచ్చేయాలని ఎంపిని కోరారు. అనంతరం ఘట్‌కేసర్ మండల బిజెపి నాయకులు వెళ్లి బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు పట్లోళ్ల విక్రంరెడ్డి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్ది మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్‌రెడ్డిలను ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, మండల అధ్యక్షులు బస్వ రాజుగౌడ్, ప్రధానకార్యదర్శి పోలు భాస్కర్‌గౌడ్, ఎంబిసి జిల్లా కో-కన్వీనర్ సాల్వేరు రఘు, బూత్ అధ్యక్షులు ఎర్రోళ్ల మురళీ, బట్టె లక్ష్మణ్‌రావు, కానుగంటి అంజనేయులు, బాధిని రాములు, బిజిలి శ్రీకాంత్, సుంకరి భరత్‌లు పాల్గొన్నారు.

## పార్టీలో అంతర్గత సమస్యలపై దృష్టి పెట్టండి

**దౌల్తాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని దౌల్తాబాద్ మండలం గోకఫస్లావాద్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. పార్టీలో సీనియర్ నాయకులు అవలంభిస్తున్న ఏకపక్ష ధోరణి కారణంగా పార్టీ ప్రతిష్ట తీవ్రంగా దెబ్బతింటోందని దౌల్తాబాద్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, గోకఫస్లావాద్ ప్రస్తుత ఉపసర్పంచ్ కుమ్మరి చంద్రప్ప ఆరోపించారు. ఇదే తీరు కొనసాగితే రాబోయే రోజుల్లో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలో ప్రతి కీలక విషయంలోనూ యువతను పూర్తిగా పక్కనపెట్టి సీనియర్ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నారని ఆయన మండిపడ్డారు. పార్టీ పెద్దలను కలవడానికి వెళ్లే సంధర్భాల్లోనూ యువజన నాయకులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల విషయంలోనూ యువకుల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకోవడం లేదని వాపోయారు. కేవలం ఎన్నికల సమయాల్లో మాత్రమే యువతను ప్రచారానికి, ఓట్ల కోసం వినియోగించుకొని, ఆ తర్వాత పక్కన పెట్టేస్తున్నారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ పెద్దలు వెంటనే స్పందించి, ఈ అంతర్గత సమస్యలపై దృష్టి పెట్టాలని.. పార్టీని గాడిలో పెట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఉపసర్పంచ్ కుమ్మరి చంద్రప్ప డిమాండ్ చేశారు.



## అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

**జవహర్‌నగర్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీనగర్ చౌరస్తాలో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ మహనీయులకు 107వ జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా మాటల క్రాంతి కుమార్, శ్రీను హాజరై అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ భారత రాజ్యాంగాన్ని పరిరక్షి ంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆయన చేసిన కృషి, సామాజిక సమానత్వం కోసం సాగించిన పోరాటాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో మాటల వినయ్, మల్లికార్జున్, భాస్కర్, మహేష్, సంగం కృష్ణ, మహంకాళి బిక్షు తదితరులు పాల్గొన్నారు.

# ఐటిఐ,ఏటిసిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**శామీర్‌పేట, ఆగస్టు 9, ప్రభాతవార్త :** ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడే సాంకేతిక విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు శామీర్‌పేట ప్రభుత్వ ఐటిఐ, ఏటిసిలో రెండవ దశ ప్రవేశాలకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు కోరుతున్నట్లు, ఈ ఐటిఐ, ఏటిసిలో కొత్తగా ఎనిమిది ప్రత్యేక ట్రేడ్లను ఏర్పాటు చేసినట్లు, ఐటిఐ ట్రేడ్లకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని శామీర్‌పేట ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ బి.హరికృష్ణ సూచించారు. శామీర్‌పేట ఐటిఐ, ఏటిసి-ఆధునిక సాంకేతికత కేంద్రం (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) మంచి అవకాశాలను కల్పిస్తుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శామీర్‌పేట ప్రభుత్వ ఐటిఐలో 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండవ దశ ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.




ఐటిఐ.తెలంగాణ.జీవిఒ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించి అభ్యర్థులు దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సూచించారు. 8వ తరగతి నుంచి టెక్నికల్ విద్యకు అవకాశం ట్రేడ్‌ను బట్టి 8వ తరగతి లేదా 10వతరగతి ఉత్తీర్ణులై ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 1 ఆగస్టు 2026నాటికి 14సంవత్సరాలు నిండిన అభ్యర్థులు అర్హులని అన్నారు. గరిష్ట వయోపరిమితి లేదని అన్నారు. మొదటి దశలో దరఖాస్తులు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తులు చేయాల్సిన అవసరం లేదని, అవసరమైతే ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పూర్తి చేసుకుని లాగిన్ ద్వారా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మెరిట్, రిజర్వేషన్, వెబ్ ఆప్షన్ల ఆధారంగానే సీట్ల కేటాయింపులు ఉంటాయని అన్నారు. అభ్యర్థులు ఆధార్, ఎస్ఎస్‌సి మెమో సర్టిఫికెట్, కులం, స్థానిక సర్టిఫికెట్లను ఒరిజినల్స్ స్కాన్ చేసి వెబ్‌సైట్లో అప్లోడ్ చేయాలని ఆయన సూచించారు. మెరిట్, రిజర్వేషన్ నిబంధనలు, వెబ్ ఆప్షన్ల ఆధారంగా సీట్ల కేటాయింపులు చేయటం జరుగుతుందన్నారు. వెబ్ ఆప్షన్లు ఎక్కువ సంఖ్యలో నమోదు చేసుకుంటే సీట్ పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ఐటిఐలో అందుబాటులో ఉన్న ఆధునిక ట్రేడ్లు ఫిట్టర్, ఎలక్ట్రిషయన్, సీఎన్‌సి మిషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్‌లకు అవకాశం ఉందని ప్రిన్సిపల్ అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ నెల 15వ తేదీ చివరి గడువు అని దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9866 843920,9866513784, 9553515596 ఫోన్లలో సంప్రదించాలని ఐటిఐ ప్రిన్సిపల్ బి.హరికృష్ణ సూచించారు.

# ప్రజల విశ్వాసమే నాయకులకు కొండంత బలం

**కడ్తాల్, ఆగస్టు 9, ప్రభతవార్త :** ప్రజా పాలనలో పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష ్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అ న్నారు. కడ్తాల్ మండల పరిధిలోని రేఖ్య తండా సర్పంచ్ పాత్లావత్ లక్ష్మి ృతో పాటు గ్రామ పంచాయతీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలకు ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజల విశ్వాసమే నాయకులకు కొండంత బలమని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తా మని తెలిపారు.



సర్పంచ్ పాత్లావత్ లక్ష్మి ృకి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మండల పార్టీ అధ్యక్షులు పోతుగంటి శంకర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానాన్ని సమాజాభివృద్ధికి ఉపయోగించాలి

## పట్టభద్రుల దినోత్సవంలో వక్తల పిలుపు

**ఘట్‌కేసర్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలో నిరంతరం నేర్చుకునే తత్వం, ఆవిష్కరణలపై ఆసక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు యువ ఇంజినీర్ల విజయానికి కీలకమని యునైటెడ్‌వే అసోసియేట్ వైస్‌ప్రెసిడెంట్ భూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పట్టభద్రుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈవేడుకలకు భూషణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మైక్రోసాఫ్ట్ ప్రిన్సిపల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ మేనేజర్ రంజిత్ కుమార్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. కేపీఆర్ఐటీ వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్, డైరెక్టర్ స్ట్రాటజీస్ కొమ్మూరి దివ్య శ్రీ, ప్రొఫెసర్ సి.డి.నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధీర్‌ప్రేమ్ కుమార్ తదితర యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. అకాడమిక్ ప్రొసెషన్‌తో ప్రారంభమైన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో అతిథులు, యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు పట్టభద్రులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో సాధించిన విజయాలను అభినందిస్తూ, ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తులో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథి భూషణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో పొందిన జ్ఞానాన్ని సమాజ అభివృద్ధికి ఉపయోగించాలని సూచించారు. ఉద్యోగ అవకాశాల కోసం మాత్రమే కాకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. మైక్రోసాఫ్ట్ ప్రిన్సిపల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ మేనేజర్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహా నూతన సాంకేతిక పరిజ్ఞానాలతో ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలు వేగంగా మారుతున్నాయని,




పట్టాల ప్రదానంలో పాల్గొన్న భూషణ్‌రెడ్డి, రంజిత్‌కుమార్, ప్రశాంత్‌రెడ్డి

విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. అకాడమిక్ పరిజ్ఞానంతో పాటు సమస్య పరిష్కార సామర్థం, కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్‌వర్క్, సృజనాత్మక ఆలోచనలు విద్యార్థుల కెరీర్‌కు ఎంతో ముఖ్యమని తెలిపారు. కేపీఆర్ఐటీ వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి పట్టభద్రులను అభినందిస్తూ, విద్యార్థులను విద్యాపరంగా మాత్రమే కాకుండా విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత కలిగిన సమర్థులైన యువతగా తీర్చిదిద్దడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు ఏ రంగంలో స్థిరపడినా తమ తల్లిదండ్రులకు, కళాశాలకు, సమాజానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా యాజమాన్య ప్రతినిధులు అతిధులను సత్కరించి, పట్టభద్రులకు భవిష్యత్ ప్రయాణానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టభద్రులతో గ్రాడ్యుయేషన్ ప్రతిజ్ఞ చేయించి, విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేశారు. అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. గ్రాడ్యు యేషన్ గౌన్లు, స్టోల్స్ ధరించిన విద్యార్థులు తమ సహచరులు, అధ్యా పకులు, తల్లిదండ్రులతో కలిసి ఈప్రత్యేక సందర్భాన్ని ఆనందంగా జరుపు కున్నారు. క్లాస్ ఆఫ్ 2026 విద్యార్థులకు ఈవేడుక మధురమైన జ్ఞాపకంగా నిలిచిందని నిర్వహకులు పేర్కొన్నారు.

# ఘనంగా బంజారాల జెండా పండుగ

**ఘట్‌కేసర్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ ఫకీర్‌టెక్యా తండాలో ఆదివారం బంజారాల సంప్రదాయ జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా తమ సాంప్రదాయ జెండాను ఆవిష్కరించి ప్రత్యేక వేడుకలు జరిపారు. శ్రీజగదాంబదేవి సహిత శ్రీసేవాలాల్ మహారాజ్ ఆలయంలో తండావాసులు ఘనంగా ప్రత్యేక పూజలు చేసి సాంప్రదాయ నైవేధ్యాన్ని సమర్పించారు. గిరిజన హక్కులు, ప్రత్యేక సంస్కృతి, వారి అస్తిత్వాన్ని రక్షించుకోవాలనే స్పృహను ఈరోజున గుర్తు చేసుకుంటూ పండుగ చేసుకున్నారు. ఈకార్యక్రమానికి తండా ప్రజల ఆహ్వానం మేరకు ముఖ్య అతిధిగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ విచ్చేసి శ్రీ జగదాంబమాత అమ్మ వారిని, శ్రీ సేవా లాల్ మహారాజ్‌లను దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్ నాయక్, బద్దం గోపాల్‌రెడ్డి, కొమురవెల్లి దేవస్థానం ధర్మకర్త మెరుగు నరేశ్‌గౌడ్, తండానాయక్ వద్యారాజునాయక్, కారోబారి నానావత్ హుస్సేన్‌నాయక్, పూజారి రామావత్ అమర్‌సింగ్‌నాయక్, మాజీ వార్డుసభ్యులు వద్యా జయందర్‌నాయక్, వద్యా చాందినాయక్, బానోత్ కిషన్‌నాయక్, నానావత్ సురేష్‌నాయక్, రామావత్ రాణీ, వద్యా పవన్‌నాయక్ సొసైటీ బ్యాంకు మాజీ డైరెక్టర్ మహేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జెండాపండుగలో పాల్గొన్న డిసిసి ఉపాధ్యక్షులు మహేశ్‌గౌడ్, రూప్‌సింగ్‌నాయక్, గోపాల్‌రెడ్డి

**బంజారా సంస్కృతిని భావితరాలకు చెప్పాలి**

**యాచారం, ఆగస్టు9, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరల్లి గ్రామంలో బంజారా సంస్కృతి, సంప్రదాయాలు పరిమళించేలా శీతలా పండుగను అత్యంత అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ కొర్ర అరవింద నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో గ్రామ ప్రజలందరూ భారీ ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. పూర్వీకులనాటి ఆచారాలను ప్రతిబింబించేలా సాగిన ఈ కార్యక్రమంలో బంజారా సంప్రదాయ వేషధారణలు, ప్రత్యేక పూజలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో సిరులు కురవాలని కోరుకుంటూ గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. బంజారా సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు



మంతన్ గౌరల్లి గ్రామంలో ..

చాటిచెప్పటమే ఈ వేడుక ముఖ్య ఉద్దేశమని కార్యక్రమలో పాల్గొన్న డిసిసి జిల్లా సెక్రెటరీ సభావట్ మధుకర్ నాయక్, గ్రామ ఉప సర్పంచ్ యాట శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షుడు అబ్బునగోని సోమయ్య యాదవ్ పేర్కొన్నారు. ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు ఆహ్లాద భరితంగా ఆటపాటలతో సాంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు.



ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

## సమస్యలతో సతమతమవుతున్నాం

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని శ్రీ రామాలయం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆదివారం స్థానిక బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. బీజేపీ నియోజకవర్గ ఇంఛార్జి ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో 8 వ వార్డు పరిధిలోని చౌదరిగూడ శ్రీ రామాలయం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎంపీని కలిసినట్లు తెలిపారు. తమ కాలనీలో ప్రధానంగా రోడ్లు పాడైపోయి గుంతల మయంగా మారాయని వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే రోడ్ల ఆధునీకరణ చేయించాలని కోరారు. దాదాపు 8 రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైకి మురుగునీరు చేరి బురదమయంగా మారాయని తెలిపారు. కాలనీలో గత 20 యేండ్ల క్రితం ఏర్పాటు చేసిన బోర్లు నేడు వట్టిపోయాయని దీంతో కాలనీలో తాగునీటి సమస్య అధికంగా ఉందని తెలిపారు. తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రోడ్ల, డ్రైనేజీ, తాగునీటి వసతితో పాటుగా వీధీ దీపాలు వెలగడం లేదని అవసరమున్నచోట లైట్లు వేయించి తమ కాలనీలో వెలుతురు నింపాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు అందజేసిన వినతి పత్రంలో కోరారు. ఎంపీని కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్రం నాగేశ్వర్‌రావు, సభ్యులు నారాయణ రావు, ఎం. సత్యం, ఎన్. రాజేందర్, డి. సోమరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డికి సత్కారం

**కేశంపేట, ఆగస్టు 9, ప్రభాతవార్త:** నూతనంగా ఎన్నికైన కొత్తపేట పిఎసిఎస్ డైరెక్టర్ రాజేందర్ రెడ్డిని తొమిదిరేకుల గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచ్ బీసా కవిత కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తొమ్మిది రేకుల లింగంధన గ్రామస్తులు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన పి ఏ సి స్ చైర్మన్ మరియు డైరెక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొమ్మిది రేకుల ఉపసర్పంచ్ రవి నాయక్ , మాజీ ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి, వార్డు మెంబర్స్ పోగుల నర్సింలు, ప్రేమలత యాదయ్య, సంతోష శివయ్య, నాయకులు గుత్తి శేఖర్, నాగిళ్ల భాస్కర్, భీమ్ రెడ్డి సుధాకర్ రెడ్డి, ఆలూరు శ్రీనివాసరెడ్డి, సుజీవన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు గూడు కోల్పోయాం..ఆదుకోండి

**కేశంపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయి, నివాసం లేక ఓ నిరుపేద కుటుంబం రోడ్డున పడిన విషాద సంఘటన కేశంపేట మండల పరిధిలోని లే మామిడి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి నిర్మలమ్మ నివసిస్తున్న ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిని కూలిపోయింది. ఉన్న ఒక్క ఇల్లు కూడా నేలమట్టం కావడంతో, తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబం ప్రస్తుతం ఆసరా లేక వీధిపాలైంది. ఇల్లు పునర్నిర్మించుకునే స్తోమత లేక నిరుపేద కుటుంబం తీవ్ర అవస్థలు పడుతోంది. ఈ సందర్భంగా బాధితురాలు నిర్మలమ్మ మాట్లాడుతూ తమ కుటుంబ పెద్దదిక్కు గత మూడు సంవత్సరాల క్రితం మృతి చెందాడని అప్పటినుండి కుటుంబ భారాన్ని ఒక్కదానినే పోషిస్తున్నానని ఉన్న గూడు కూలిపోవడంతో తమ దీనస్థితిని పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వం వెంటనే స్పందించి తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, అలాగే ప్రభుత్వం తరఫున పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని వేడుకున్నారు.




దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యు మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు మల్‌రెడ్డి అభిశేక్ రెడ్డి

## యువత కలల సాకారమే లక్ష్యం

### ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 9, ప్రభాతవార్త :** నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడంతో పాటు స్థానిక యువతను ఉన్నత స్థాయికి చేర్చడమే తన ప్రధాన లక్ష్యమని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. జీవితంలో ఎదుగుదలకు యువత వేసే ప్రతి అడుగులోనూ తమ సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన భరోసానిచ్చారు. ఈ మేరకు మల్‌రెడ్డి యువశక్తి, ఎంఆర్ఆర్ ఫౌండేషన్ ఉమ్మడి ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి సారథ్యంలో చేపట్టిన ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని పోలీస్ ఉద్యోగ అభ్యర్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్ అంతా యువత చేతుల్లోనే ఉందన్న ఎమ్మెల్యే ఉద్యోగ నోటిఫికేషన్ల విషయమై అభ్యర్థులు ఆందోళన చెందవద్దని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా ప్రక్రియ ముందుకు వెళ్లేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రాజు, సీఐ మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ భాస్కరాచారి, ముఖ్య నాయకులు మహిపాల్, పాండురంగారెడ్డి, ఈసీ శేఖర్ గౌడ్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్లు, ఫిజిక్స్ ఫ్యాకల్టీ రమేశ్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కన్నతల్లి లాంటి సొంత గ్రామాన్ని వదలను

## రైతు సంక్షేమమే లక్ష్యంగా సేవ చేస్తా : పిఎసిఎస్ చైర్మన్

**కొత్తూరు, ఆగస్టు 9, ప్రభాతవార్త:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మేకగూడ పీఏసీఎస్ చైర్మన్ అంబటి ప్రభాకర్ అన్నారు. కొత్తూరు మండలం ఎస్ బి పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ కి మేకగూడా పీఏసీఎస్ చైర్మన్గ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా తన సొంత గ్రామంలో గ్రామ సర్పంచ్ సుమిత్ర మల్లారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ అంబటి ప్రభాకర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతు సోదరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంత ఎత్తుకు ఎదిగినా కన్నతల్లి లాంటి సొంత గ్రామాన్ని ఎన్నటికీ మరువనని, గ్రామ ప్రజలకు, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని తెలిపారు. పీఏసీఎస్ పరిధిలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చర్యలు తీసుకుంటానని, ప్రభుత్వం అందించే రుణాలు, సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు తదితర ప్రయోజనాలు అర్హులైన రైతులకు సకాలంలో అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా గ్రామ



పిఎసిఎస్ చైర్మన్ అంబటి ప్రభాకర్‌ను సత్కరిస్తున్న స్థానికులు

ప్రజల సంపూర్ణ సహకారంతో అనేక కార్యక్రమాలు చేపట్టానని, వారి మద్దతే తనను ఈ స్థాయికి తీసుకువచ్చిందని గుర్తు చేసుకున్నారు. సర్పంచ్ సుమిత్ర మల్లారెడ్డి, గ్రామ నాయకులు మాట్లాడుతూ.. ఎస్‌బీ పల్లికి చెందిన వ్యక్తి మేకగూడ పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నిక కావడం గ్రామ ప్రజలందరికీ గర్వకారణమన్నారు.

తమ గ్రామానికి చెందిన అంబటి ప్రభాకర్‌కు ఈ అవకాశం కల్పించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ పదవి కేవలం గౌరవం కోసం కాదని, రైతులకు మరింత సేవ చేసే బాధ్యతగా భావించాలని వారు సూచించారు. సొసైటీ పరిధిలోని రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చైర్మన్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందనడానికి అంబటి ప్రభాకర్ నియామకమే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఎమ్మె శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మె వెంకటయ్య, మల్లారెడ్డి, కృష్ణయ్య, లింగారం సురేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎమ్మె బాలరాజ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లో బోనాల ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే మల్లారెడ్డి





బోనాల వేడుకల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, నందిగామలో పోచమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

# ఊరూర బోనమెత్తి..

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం తెలంగాణ సంస్కతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని అమ్మవార్ల ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. గ్రామంలోని మైసమ్మ, పోచమ్మ, మహంకాళమ్మ తదితర అమ్మవార్లకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం ఎత్తుకుని ఊరేగింపుగా డప్పువాయిద్యాలు, పోతరాజుల నృత్యాలు, శివసత్తుల నృత్యాలతో అంగరంగవైభవంగా బోనాల వేడుకలు జరిగాయి. బోనాల వేడుకలకు విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డికి గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న వారిలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ నాయకులు సామల సందీప్‌రెడ్డి, నీరుడి శ్రీనివాస్ ముదిరాజ్, కందుల నవీన్ కుమార్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు వేగానంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కురుమ సంఘం ఆధ్వర్యంలో**

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 9, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ వార్డు 8లోని అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీ, మోడీ కాలనీలో ఆదివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప బోనాల ఉత్సవాలు జరిగాయి. బోనాల వేడుకలకు పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ మాట్లాడుతూ కురుమ సోదరుల ఆరాధ్యదైవం బీరప్ప స్వామి వారి ఆశీస్సులు పోచారం డివిజన్ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బైర ఐలయ్య కురుమ, కేఎం. రెడ్డి, కొమ్ముల ప్రశాంత్, మ్యాక యాదయ్య, శ్రీను, కనకయ్య, నాగరాజు, కోటేశ్, పర్వాతాలు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలు సుభిక్షంగా ఉండేలా దీవించు**

**నందిగామ, ఆగస్టు 9, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో ఆదివారం సర్పంచ్ కొమ్ము కృష్ణ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై అమ్మోరు తల్లి పూజ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా దీవించమని అమ్మవారిని వేడుకున్నారు. బోనాల వేడుకలు శివసత్తుల ఆటపాటలతో,డిజె సౌండ్ సిస్టం మధ్య, పోతురాజుల విన్యాసాలు, మధ్య, టపాకాయలు కాలుస్తూ ముందుకు సాగారు. ఈ బోనాల వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది. చిన్న, పెద్ద ,ముసలి ముతక ,వయోభేదం లేకుండా మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కావలి కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ నర్సింహులు, సింగిల్ విండో చైర్మన్ కుందారం వెంకట్ రెడ్డి, చేగూరు చైర్మన్ పసుల బుచ్చయ్య, చేగూరు సర్పంచ్ మంకాల శ్రీశైలం, ఉప సర్పంచ్ ఆవుల మంద శివ, కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి, నందిగామ వార్డు సభ్యులు అది ప్రసాద్, అగ్గి మమత సూరి, శివగళ్ల ప్రవీణ్, శివగళ్ల సురేష్, బొమ్మగల నర్సింలు, టైలర్ కృష్ణ, డైరెక్టర్ ఏకుల అంజయ్య, కేశమోని రామచంద్రి,శివగళ్ల సుమన్, నరేందర్ రెడ్డి, అభిలాష్, శ్రీకాంత్, కుమ్మరి సురేష్, చాకలి బాలరాజ్, పడకల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

**శంకర్‌పల్లి మున్సిపాలిటీలో..**

**శంకర్‌పల్లి, ఆగస్టు 9, ప్రభాతవార్త :** శంకర్ పల్లి మున్సిపాలిటీలో బోనాల ఉత్సవాలను కనుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి బోనం ఎత్తుకొని అమ్మవారి ఆలయం వరకు ర్యాలీగా బయలుదేరి నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ప్రజల సుఖ సంతోషాల మధ్య వర్ధిల్లేలా అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షి ంచారు.

**మొయినాబాద్ మండలంలో ..**

**మొయినాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త :** :మండలంలోని పలు గ్రామాల్లో కనకమామిడి అప్పారెడ్డి గూడ తోల్కట్ట కేతిరెడ్డిపల్లి తో పాటు ఆయా గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మహిళలు కొత్త కుండల్లో బోనాలను తయారు చేసి, పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించి సాంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. బోనాల వేడుకల్లో సరికొత్త డప్పులతో కళాకారులు చేసిన వినూత్న విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పుల దరువులకు అనుగుణంగా కళాకారులు ప్రదర్శించిన విన్యాసాలను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా తిలకించారు. డప్పుల మోతతో కేతిరెడ్డిపల్లి వీధులు మార్మోగగా, యువత, మహిళలు, చిన్నారులు కేరింతలతో వేడుకల్లో సందడి చేశారు. అమ్మవారి వేషధారణలో కళాకారులు చేసిన ప్రదర్శనలు, శివసత్తుల పూనకాలు, సంప్రదాయ విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో గ్రామమంతా భక్తి, ఆనందోత్సాహాలతో ప్రత్యేక పండుగ శోభను సంతరించుకుంది. అనంతరం మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. కే.ఎన్.ఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలు భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక సందడితో ఘనంగా సాగాయి. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ..**

**యాచారం ఆగస్టు9 ప్రభాతవార్త :** సాంప్రదాయ డ బి.ఎన్.ఆర్ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, వర్త్యావత్ రాజు అన్నారు. యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిలకంటి చంద్ర శేఖర్ రెడ్డి,వర్త్యావత్ రాజు నాయక్ ముఖ్యఅతిథులుగా హాజరైనారు. కార్యక్రమంలో పోతురాజుల విన్యాసాలు, శివసతుల ఆటలు పాటలు అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించి సంబరాలు అంబరాన్ని అంటినవి, గ్రామంలో ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు అట్టహాసంగా ఆహ్లాద భరితంగా ఆటపాటలతో సాంప్ర దాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జె శ్రీశైలం,వార్డు సభ్యులు కొండాపురం సుష్మ, సంధ్య, నరేష్,నాయకులు జోగి రెడ్డి,మల్లా రెడ్డి, దానయ్య, కొండాపురం శ్రీశైలం, రవీందర్, నూకం మహేందర్, బండి అలెగ్జాండర్, కొండాపురం పాండు, కొడాపురం కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో ఆకట్టుకున్న అమ్మవారి వేషధారణలో కళాకారులు



నంది వనపర్తి గ్రామంలో జరిగిన బోనాల సంబురంలో స్థానిక ప్రముఖులు



పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామంలో పోచమ్మతల్లి ఆలయానికి బోనంతో వెళుతున్న భక్తులు

**తాండూరులో**

**తాండూరు, ఆగస్టు 9, ప్రభాతవార్త :** ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు తాండూరు పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని అమ్మవారి దేవాలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పట్టణంలోని కాళికాదేవి ఆలయంతో పాటు. ఆదర్శనగర్ కట్టమైసమ్మ దేవాలయం, గాంధీనగర్‌లోని కట్టమైసమ్మ దేవాలయాల్లో బోనాల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పట్టణంలోని కాళికాదేవి ఆలయంలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు, పట్టణ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదర్శనగర్ కట్టమైసమ్మ దేవాలయంలో కూడా బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా కాలనీ వాసులతో కలిసి అమ్మవారికి బోనం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు. అదేవిదంగా గాంధీనగర్‌లో కట్ట మైసమ్మ దేవాలయంలో జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ నవీన, బిఆర్ఎస్ నాయకులు సంతోష్‌గౌడ్ దేవాల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు, ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పట్టణంలోని దేవాలయాల్లో అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.

**పూడూరు మండలంలో**

**పూడూరు,ఆగస్టు 9, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని ఎన్కెపల్లి, అంగడి చిట్టంపల్లి,చెన్‌గోముల్, సోమన్‌గుర్తి, మిట్టకంకల్, కంకల్, రాకంచెర్ల, కండ్లపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఉదయం పూట గ్రామంలో ప్రతిఇంటిని శుభ్రపరుచుకున్న గ్రామస్తులు మధ్యాహ్నం గ్రామదేవత పోచమ్మ అమ్మవారికి బోనంతోపాటు పిండివంటలతో తయారు చేసిన పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారి దేవాలయాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో శివసత్తులు భవిష్యవాణిని వినిపించారు. ఈ సందర్భంగా అమ్మవారి చలువతో గ్రామంలో పాడిపంటలతో ప్రతిఒక్కరు చల్లంగ ఉండాలని దీవించారు. డప్పుచప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలు. శివసత్తుల పూనకాలు భక్తులను ఆలరించాయి. ఈ సందర్భంగా వివిధ గ్రామాలనుండి పాల్గొన్న భక్తులు తమ మ్రొక్కులను తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు,గ్రామపెద్దలు తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

**హైతాబాద్‌లో**

**షాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని హైతాబాద్ లో బోనాల ఉత్సవాలను ఆదివారం కన్నుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను అలంకరిం చుకొని గ్రామ పురవీధుల గుండా భారీ ర్యాలీగా బయలు దేరారు. పోతురాజుల విన్యాసాలు డప్పు వాయిద్యాల మధ్య సాగిన ఊరేగింపులో తొట్టెల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు.



శంకరపల్లిలో బోనం ఎత్తుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి



బోనం సమర్పిస్తున్న తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పటోళ్ల నీరజ



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న హైతాబాద్ గ్రామస్తులు



జిల్లేడు చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో మైసమ్మ బోనాల జాతర దృశ్యం



## 23న బోనాల నిర్వహణకు నిర్ణయం

**ఘట్‌కేసర్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లో ఈనెల 23వ తేదీన బోనాల పండగ నిర్వహించాలని నిర్ణయిం చారు. ఆదివారం శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ ఆవరణలో జరిగిన సమావేశంలో బోనాల నిర్వహణపై చర్చించారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు హజరై బోనాల పండుగను 23వ తేదీ ఆదివారం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. రోడ్లు శుభ్రం చేసి పారిద్య పనులు, వీధి దీపాల ఏర్పాటు కోసం మున్సిపల్ అధికారులను కోరాలని, గ్రామదేవతల ఆలయాలకు రంగులు వేసి అలంకరించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. బోనాల ఖరారు తేదీని డప్పు చాటింపు ద్వారా ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈసమావేశంలో డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు వేముల సంజీవగౌడ్, బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్యగౌడ్, భోనకుర్తి అర్జున్, వేముల పరమేశ్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు వేముల యాదగిరిగౌడ్, వేముల శ్రీనివాస్‌గౌడ్, మండల కృష్ణగౌడ్, నాయకులు వేముల మహేశ్వర్‌గౌడ్, వేముల భాస్కర్‌గౌడ్, డొంకెన రవీందర్‌గౌడ్, డొంకెన రాజేశ్వర్‌గౌడ్, కుంట్ల బుచ్చిరెడ్డి, వేముల పరమేశ్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**30న ఘట్‌కేసర్‌లో ..**

ఘట్‌కేసర్‌లో ఈనెల 30వ తేదీన బోనాల పండుగ నిర్వహించాలని నిర్ణయిం చారు. పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మండపంలో ఆదివారం మాజీ ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు, పనివారల సభ్యులు సమావేశవమై బోనాల నిర్వహణపై చర్చించారు. అందరి అభిప్రాయం మేరకు ఈనెల 30న బోనాల పండుగను జరుపుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. బోనాల సందర్భంగా పట్టణంలో పారిశుధ్య పనులు, వీధిదీపాల ఏర్పాటు చేయాలని అధికారులను కోరాలని తెలిపారు. గ్రామదేవతల ఆలయాలను రంగులు, విద్యుత్‌దీపాలతో అలంకరించి సాంప్రదాయం ప్రకారం బోనాలను సమర్పిం చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయా లని నిర్ణయించారు. సమావేశంలో మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, సహకార సంఘం మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, మాజీ చైర్‌పర్సన్ భర్త ముల్లి జంగయ్యయాదవ్, గౌడ సంఘం అధ్యక్షులు మదనగిరి సురేశ్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రాజబోయిన యాదగిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




దేవరయాంజాల్‌లో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు

## శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో ..


**శామీర్‌పేట, ఆగస్టు 9, ప్రభాతవార్త :** శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల్లో, మూడుచింతలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో బోనాల పండుగను ప్రజలు ఘనంగా సంతోషంగా జరుపుకున్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి అమ్మవారి భక్తి పాటలతో మారుమోగించారు. మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో, పోతరాజుల విన్యాసాలతో ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకోవటం జరిగింది. అయితే శామీర్‌పేట మండలంలోని దేవరయాంజాల్, తూంకుంట,హకీంపేట్, సింగాయిపల్లి గ్రామాల్లో జరిగిన బోనాల పండుగలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, తూంకుంట మున్సిపల్ మాజీ చైర్మన్ కె.రాజేశ్వర్‌రావులు పర్యటించి అమ్మవారి ఆలయాల్లో పూజలు చేశారు. శామీర్‌పేట గ్రామంలో ముదిరాజ్ బస్తీ వారి ఆద్వర్యంలో గ్రామంలో బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు నోముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పి.వీరారెడ్డి, పి.నర్సింగ్‌రావుగౌడ్, వంగ వెంకట్‌రెడ్డి, కట్టెల రవీందర్, పలువురు నాయకులు పాల్గొని పూజలు చేశారు. వివిధ గ్రామాల్లో ప్రజలు బోనాల పండుగను సాంప్రదాయబద్దంగా ఘనంగా జరుపుకున్నారు.

## తెలంగాణ సంస్కృతికి బోనాల ఉత్సవాలు ప్రతీక

**ఘట్‌కేసర్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బోనాల పండుగ ఆషాఢ మాసంలో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ అమ్మవారి జాతర అనం తరం వచ్చే ఆదివారం ఇక్కడ బోనాల పండుగ జరుపుకోవడం అనవాయితీగా వస్తున్నది. ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ, చందుపట్లగూడ, దత్తాత్రేయనగర్, సాయిసందీప్‌కాలనీ, పరమేశ్వరీనగర్, శివారెడ్డిగూడ మారుతీనగర్–శ్రీనిధి నెస్ట్ కాలనీల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయకమిటీల ఆధ్వర్యంలో గ్రామదేవతల ఆలయాలకు రంగులు వేసి మామిడి, వేప తోరణాలు, పూలు, విద్యుత్‌దీపాలతో అంకరించారు. పోచమ్మ, చిత్తారమ్మ, బంగారు మైసమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ తదితర గ్రామ దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొక్క సంగీతా ప్రభాకర్‌రెడ్డి దంపతులు బొక్కోనిగూడలో అమ్మవార్లకు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అన్నం, బెల్లం, పాలతో వండిన ఆహారం కుండలో ఉంచి పసుపు, కుంకుమ, వేప ఆకులతో అలంకరించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఎన్ఎఫ్‌సీనగర్‌లోని చిత్తారమ్మ, పోచమ్మ అమ్మవార్లను ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్ఐ శేఖలు దర్శించుకోగా నిర్వహకులు శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెడబోయిన వెంకటేశ్, మాజీ ఎంపిటిసి జంపాల రమేశ్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి మహిపాల్‌గౌడ్, మాజీ ఉపసర్పంచులు బొక్క సురేందర్‌రెడ్డి, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు కొంతం రాంరెడ్డి, గడీల సంజీవరెడ్డి, గడీల రామచంద్రారెడ్డి, చందుపట్ల అండాలు, విబి.వెంకటనారాయణ, సొసైటీ డైరక్టర్ బొక్క స్రవంతి కృష్ణారెడ్డి, నాయకులు కంభం లక్ష్మారెడ్డి, మెడబోయిన సంజీవ, బొక్క విష్ణువర్దన్‌రెడ్డి, పడిగెం వీరేశం, వి.లింగస్వామి, ప్రవీణ్‌కుమార్, అంజనేయులు, లంబ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. బోనాల సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



బొక్కోనిగూడలో అమ్మవారికి బోనం సమర్పించిన మాజీ కౌన్సిలర్ సంగీతాప్రభాకర్‌రెడ్డి



దాత కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిలర్ గోవర్ధన్‌రెడ్డి


## పబ్లిక్ ప్లేస్‌లో సిట్టింగ్ బెంచీలు విరాళం

**శామీర్‌పేట, ఆగస్టు 9,ప్రభాతవార్త :** కేశ్వాపూర్ గ్రామంలోని దేవా లయాల వద్ద, గ్రామ వార్డు కార్యాలయం ఆవరణలో, శ్మశా నవాటికల వద్ద గ్రామానికి చెందిన దాత ఐలాపురం కిరణ్‌కు మార్‌రెడ్డి సిట్టింగ్ సిమెంట్ బెంచీలను విరాళంగా అందజేయటంతో ఏర్పాటు చేశారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని కేశ్వాపూర్‌లో దాత ఐలాపురం కిరణ్‌కుమార్‌రెడ్డి స్వర్గీయ ఐలాపురం ప్రమీల జ్ఞాపకార్థం ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా గ్రామంలోని పలు చోట్ల సుమారు 1,20,000రూపాయల విలువ చేసే సిమెంట్ సిట్టింగ్ బెంచీలను ఏర్పాటు చేశారు. అదే విధంగా గ్రామానికి అవసరం ఉన్న చోట వీధి దీపాలు కూడ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదే విధంగా గ్రామాభివృద్ధికి సహకారం ఉండాలని కౌన్సిలర్ గోవర్ధరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో బోనాల సంబురం


అంబర్‌పేట మహంకాళి బోనాల వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు


అంబర్‌పేటలో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్న బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి తలసాని ఎమ్మెల్యే కాలేరు తదితరులు


బర్కత్‌పురలో అమ్మవారి బోనాల వేడుకల్లో పాల్గొన్న జిహెచ్‌ఎంసి మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు


అంబర్‌పేటలో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్న అంబర్‌పేట బిఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి


గోల్నాక బోనాల వేడుకల్లో మాజీ కార్పొరేటర్ దూసరి శ్రీనివాస్‌గౌడ్


బుద్వేల్ రైల్వేస్టేషన్ బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


రాజేంద్రనగర్ బోనాలు వేడుకల్లో మాజీ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్


మారేడ్‌పల్లి మైసమ్మ దేవాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు


అమ్మవారికి బోనంసమర్పిస్తున్న కంటోన్మెంట్ బోర్డుమెంబర్ బానుక నర్మద


నల్లపోచమ్మ ఆలయంలో జరిగిన బోనాల వేడుకల్లో జంపన ప్రతాప్


వెంకటేశ్వరకాలనీలో ఎమ్మెల్యే దానం నాగేందర్, భారతీనాయక్ తదితరులు


ప్రతాప్‌నగర్‌లో బోనం ఎత్తుకున్న మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి


బోనాల వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్


అమ్మవారికి పూజలు చేస్తున్న రాధారెడ్డి, రవి శేఖర్‌రెడ్డి దంపతులు


అమ్మవారి సేవలో కోట నీలిమ


నల్లపోచమ్మఆలయంలో పూజలుచేస్తున్న బిఆర్‌ఎస్‌నేత మన్నె క్రిషాంక్, శ్రీను


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి


పోచమ్మతల్లి దేవాలయం పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్


అంబర్‌పేటలో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్న శ్రీకాంత్‌గౌడ్, ఉషశ్రీగౌడ్


నల్లపోచమ్మఅమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ ఆకుల చంద్రశేఖర్


మైసమ్మని దర్శించుకున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్

## దర్బార్ మైసమ్మ తల్లికి ఘనంగా ఘనంగా బోనాలు

### ఉదయం నుంచి పోటెత్తిన భక్తులు

**కార్వాన్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** కార్వాన్ దర్బార్‌మైసమ్మ, మహాంకాళి మైసమ్మ ఉమ్మడి దేవాలయాలలో బోనాల పర్వదినంను పురష్కరించుకుని తెల్లవారుజామున ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి బోనాల గండ దీపం, నైవేథ్యాలు సమర్పించారు. కార్వాన్ పరిసరప్రాంతాల వివిధ భస్తీల ప్రజలు డప్పు వాయిద్యాలతో ఊరేగుతూ ఉదయం నుంచి పోటెత్తిన భక్తులు భక్తి శ్రద్ధలతో సాకలు పోసి, అమ్మవారి తొట్టెలకు బోనం సమర్పించారు. అమ్మవారి స్వాగత వేదికపై రాజకీయ, రాజకీయేతర నాయకులు పాల్గొని సందడి చేసారు.

### దర్బార్ మైసమ్మ తల్లిని దర్శించుకున్న కేంద్ర మంత్రులు

కార్వాన్ దర్బార్ మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ లకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక బాల బాలికలచే భరత నాట్య ప్రదర్శన, అతిథుల ఆహ్వానం, సన్మానం ఉన్తయి రాత్రి మాతా జాగరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

### మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి: మల్లారెడ్డి

**కంటోన్మెంట్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని 7 గుళ్ల దేవాలయంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను బిఆర్‌ఎస్ నేత ఆర్. టింకూ గౌడ్, వారికి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.


బోయిన్‌పల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, కుటుంబసభ్యులు

## నేడు జైల్ భరోను జయప్రదం చేయాలి : నర్సింహా

**సైఫాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేకంగా ఈ నెల 10వ తేదీ సోమవారం దేశ వ్యాప్తంగా జరగ నున్న 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి ఎం.నరి ్సంహ కార్మికలోకానికి విజ్ఞప్తి చేశారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన ఎఐటియుసి హైదరాబాద్ సమితి కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు కార్మికలోకం ఎన్నో పోరాటాలు నిర్వహించి 44 కార్మిక చట్టాలను సాధించుకున్నదని, నేడు ప్రధాని నరేంద్రమోదీ ఆ చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా విభజించి కార్పోరేట్ సంస్థలకు మేలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం ఈ 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 6,7, 8 తేదీలలో కరీంనగర్‌లో జరిగే ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేసి కార్యచరణను రూపొందించడం జరుగు తుందన్నారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బొడ్డుపలి ్ల కిషన్ అధ్యక్షత వహించగా నాయకులు హసినా బేగం, చెట్టుకింద శ్రీనివాస్, కమతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.నర్సింహా. చిత్రంలో కిషన్, యాదగిరి తదితరులు

## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**ముషీరాబాద్, ఆగస్ట్ 9, ప్రభాతవార్త:** ఆదివాసీ గిరిజనుల హక్కుల పరిరక్షణకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ట్యాంక్‌బండ్‌పైనున్న కొమురం భీం విగ్రహం వద్ద గిరిజన ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ వివేక్ వినాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జస్టిస్ నరసింహారెడ్డి హాజరై, కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్టీ కమీషన్‌ను తక్షణమే ఎస్సీ ఎస్టీ కమిషన్ నుంచి వేరుచేసి, ఎస్టీలకు ప్రత్యేకంగా కమీషన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. అనేకసంవత్సరాలుగా ఆదివాసి గిరజనులు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుకోలేక చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ గిరిజనులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని, వారి అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన ఐటిడిఏలను రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలుచేయాలని కోరారు. పిఇఎస్‌ఏ యాక్ట్ తక్షణమే అమలుచేసేందుకు చర్యలు చేపట్టాలని, గిరిజన పారిశ్రామిక వాడలు నెలకొల్పి, గిరిజనులను పారిశ్రామిక వైపు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. అటవీ హక్కుల చట్టం 2006ను అమలుచేయాలని, పెండింగ్‌లో ఉన్న అటవీ పత్రాలను తక్షణమే పంపిణీ చేయాలని, బోగస్ కుల ధృవీకరణ పత్రాలు లేకుండా ఎంఆర్‌ఓలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాలలో భారీ పరిశ్రమలు ఖనిజ త్రవ్వకాలకు స్థానికంగా ఉన్న ఆదివాసులకే హక్కు ఉండాలని, అడక్వసీ పదాన్ని తొలగించాలని, ఎస్టీ బ్యాక్ టాగ్ పోస్టులు భర్తీ, పదోన్నతి, ప్రమోషన్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపరచాలని డిమాండ్ చేశారు. 1పై70 చట్టాన్ని పారదర్శకంగా పకడ్బందీగా అమలుచేసి, గిరిజన భూములను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్య వేదక ప్రధాన కార్యదర్శి సోయం ప్రభాకర్, కోశాధికారి సోయం గోవర్ధన్, ఉపాధ్యక్షులు కిష్టయ్య, ఐక్యవేదిక కార్యదర్శి దన్నారి శ్రీరాములు, నాయకులు వెట్మాతిరుపతి మరియు గిరిజన నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జస్టిస్ నరసింహారెడ్డి

## ఘనంగా అంబారీ ఊరేగింపు మహోత్సవం

**కార్వాన్, ఆగస్టు 9, ప్రభాతవార్త :** కార్వాన్ సబ్జిమండిలోని నల్ల పోచమ్మ, మాత మహంకాళి దేవి అమ్మవార్లకు 104వ వార్షిక బోనాల ఉత్సవాలను 14 బస్తీల వాసులు భక్తి భావంతో బోనాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని ఉత్సవకమిటీ అధ్యక్షులు కట్ట లింగం తెలిపారు. మహిళలు సామూహికంగా బోనాలతో బయలుదేరి నటరాజ్ నగర్ లోని నల్ల పోచమ్మ ఆలయంలో బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఏనుగు అంబారీపై అమ్మవారి ఘటాన్ని అతి సుందరంగా అలంకరణ చేసి జానపద కళాకారుల నృత్యాలూ, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాల సందడితో వివిధ వేషధారణ నడుమ మహిళలు, చిన్నారులు, యువకులు ఎంతో ఉత్సాహంగా వెంటరాగా ఊరేగింపును ఎంతో కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గడ్డం వివేక్ వెంకటస్వామి, అతిథులుగా బండి సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్‌లు పాల్గొని పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్లె రాంకుమార్, కోశాదికారి చింత శ్రీకాంత్, కమిటీ నలహాదారులు కట్ట రాజయ్య, గూడబోయిన శివరత్నం, జలగరి వేణు, కట్ట శివరాజ్, బుర్ర వేణు కుమార్, కట్ట నర్సింగరావు, ఆవుశెట్టి శ్యాంసుందర్, గుడుమని అశోక్ కుమార్, గాండ్ల నిరంజన్ బాబు, ప్యాట నందకిషోర్, దొర్తుల శ్రీనివాస్, పూజ కమిటీ సభ్యులు అతిథులను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భక్త మహాజనులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమమును విజయవంతంగా నిర్వహించారు.

### రాంనగర్‌లో ఘనంగా బోనాల వేడుకలు

**చిక్కడపల్లి, ఆగస్టు 9, ప్రభాతవార్త:** రాంనగర్ డివిజన్‌లో నిర్వహించిన బోనాల పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు రేషం మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో మాజీ మంత్రులు కె టి రామారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలుచేసి, తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఎం ఎన్. శ్రీనివాస్ రావు, ముఠా జయ సింహ, సిరిగిరి శ్యామ్, నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బోనాలు ఉత్సవాలలో పాల్గొన్న ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు